క్లుప్తంగా

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీ పెదరావికోన గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. దసరా పండుగ నేపథ్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో 18 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు దసరా రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఎస్.భాస్కరావు, టి.రమేష్, నీలకంఠం, వెంకటరావు, సుందరరావు తెలిపారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

పాచిపెంట: ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. యూరియా కొరతపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల వ్యవసాయాధికారిని నిలదీశారు. గిరిజన ప్రాంత రైతులకు యూరియా అందని ద్రాక్షగా మిగిలిందని వాపోయారు. కేరంగి పంచాయతీలో సుమారు 40 మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమ కాలేదని సర్పంచ్ సోము లచ్చయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. కారణాలు తెలుసుకుని డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో సతీష్‌ను ఎంపీపీ ఆదేశించారు. గిరిజన ప్రాంత రహదారులు అధ్వానంగా ఉన్నాయని వాటిని బాగు చేసే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులను సభ్యులు కోరారు. అలాగే గత ప్రభుత్వంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్లు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం గిరిజన ప్రాంత ప్రజలకు తెలియడం లేదని, సచివాలయాలకు వెళ్లి తమ సమస్యలు చెప్పుకున్నా అక్కడ పట్టించుకునే పరిస్థితి లేదని, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ,గిరిజన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ ముందు వాపోయారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన పెంచుకోవాలి

- వ్యవసాయశాఖ అధికారి అశోక్

పార్వతీపురం రూరల్: ప్రజలకు, శాఖాపరంగా రైతులకు జవాబుదారీతనంగా వ్యవహరించడం అత్యంత కీలకంతోపాటు అధికారుల బాధ్యత అని ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి ఏ సమాచారం అయినా తెలుసుకునే హక్కును సమాచార హక్కుచట్టం పౌరులకు కల్పించిందని పార్వతీపురం మండల వ్యవసాయశాఖ అధికారి అశోక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో మండలంలో ఉన్న 21మంది గ్రామీణ వ్యవసాయశాఖ సహాయ సిబ్బందితో అవగాహన సదస్సు సమావేశం ఏర్పాటు చేసి చట్టంపై వారికి అవగాహన కల్పించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

పాచిపెంట: హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా గిరిజన సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మించాలని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేలా గిరిజన ప్రజలు జలసమాధి కాకుండా చూడాలని వినతిపత్రంలో కోరారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే నాయకులు ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి పూనుకుంటున్నారని ధ్వజమెత్తారు.

ఆర్టీసీ సేవలు | అంతంతమాత్రమే..?

- విశాఖపట్నం, పొల్ల సర్వీసులు కట్
- వీరఘట్టం – శ్రీకాకుళం ఫస్ట్ బస్ రద్దు
- నిలిచిపోయిన పార్వతీపురం నైట్‌హాల్ట్
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



వీరఘట్టం:

వీరఘట్టం – విశాఖపట్నం, వీరఘట్టం – పొల్ల, దోనుబాయి రూట్‌లలో నడిపే ఆర్టీసీ బస్సులకు కనీసం డీజిల్ ఖర్చు కూడా రావడం లేదని ఆ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం గతంలో రద్దు చేసింది. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా ఆయా రూట్‌లలో ఆర్టీసీ బస్సులు నడపకపోవడంపై మహిళా ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇలా వీరఘట్టం మండల ప్రజలకు ప్రయాణ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. అవసరమైన ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక నిత్యం ప్రయాణికులతో పాటు వ్యాపారులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. పార్వతీపురం నుంచి రాత్రి 9 గంటలు దాటిన తర్వాత వీరఘట్టానికి బస్సు సర్వీసులు లేవు. అలాగే వీరఘట్టం నుంచి ఉదయం 5 గంటల వరకు పార్వతీపురం వెళ్లేందుకు బస్సుల్లేవు. పార్వతీపురం నుంచి వీరఘట్టం వచ్చే నైట్‌హాల్ట్ సర్వీస్‌ను కూడా రద్దు చేశారు. వీరఘట్టం నుంచి పొల్ల, నీలకంఠాపురం వెళ్లే బస్సు సర్వీసును.. వీరఘట్టం నుంచి ఉదయం 5 గంటలకు విశాఖపట్నం వెళ్లే బస్సు సర్వీసు కూడా ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. ఇలా వీరఘట్టం రావడానికి, ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే పలు ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దు చేయడంతో మండల ప్రజలను ప్రయాణ కష్టాలు వెంటాడుతున్నాయి.

పేరుకే ఉచిత ప్రయాణం..

కూటమి ప్రభుత్వం పేరుకే మహిళలకు ఉచిత ప్రయాణం అని ప్రకటించింది. అయితే చాలా రూట్లలో బస్సు సర్వీసులు లేవు. వీరఘట్టం మండలం కేంద్రం సీతంపేట, వంగర, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలంలోని కొన్ని గ్రామాలకు వ్యాపార కేంద్రంగా ఉంది. దీంతో ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం వీరఘట్టం వస్తుంటారు. అయితే బస్సులు సరిపడా లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో ఈ రూట్‌లలో బస్సులు తిరిగేవి. తగినంత ఆదాయం రావడం లేదనే సాకుతో కాలక్రమంలో బస్సులను రద్దు చేశారు.

ఇతర ప్రాంతాలకు..

సుమారు 18 వేల మంది జనాభా ఉన్న వీరఘట్టం మేజరు పంచాయతీలో నిత్యం 500 మంది ఉద్యోగం, వ్యాపారం, చదువు, వైద్యం నిమిత్తం పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఒకవేళ రాత్రి పూట వీరఘట్టం రావాలన్నా సర్వీసులు లేకపోవడంతో మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

విశాఖపట్నం బస్సు పునరుద్ధరించాలి..



వీరఘట్టం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సును ఏడాదిన్నర కిందట రద్దు చేశారు. దీని వల్ల నిత్యం వందలాది మంది విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విశాఖపట్నం సర్వీస్‌ను పునరుద్ధరించాలి.
– నడికట్ల తిరుమలరావు, వీరఘట్టం

రాత్రి 9 దాటితే నరకమే..



విశాఖపట్టణం వెళ్లిన వాళ్లు రాత్రి 9 గంటల తర్వాత పార్వతీపురంలో దిగుతున్నారు. ఫస్ట్ షో సినిమాకు వెళ్లిన వాళ్లు రాత్రి 9.15 గంటలకు వస్తున్నారు. అయితే పార్వతీపురం నుంచి రాత్రి 9 గంటల తర్వాత నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు లేకపోవడంతో వీరఘట్టం వైపు వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. – పత్తిక కామేశ్వరరావు, సర్పంచ్, చిన్నగోర, వీరఘట్టం మండలం

గిరిజనులకు ఇక్కట్లు..



పొల్ల, దోనుబాయి, నీలకంఠాపురం, మానాపురం, తదితర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది గిరిజనులు వీరఘట్టం వస్తుంటారు. అయితే ఈ రూట్‌లో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆయా రూట్‌లలో బస్సులు నడపాలి. – బిడ్డిక కమలమ్మ, సర్పంచ్, మూలలంక, వీరఘట్టం మండలం

జీఎస్టీ తగ్గింపుతో లబ్ధి

గరుగుబిల్లి:

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ గజలక్ష్మి అన్నారు. మండలంలోని గొట్టివలస, కొంకడివరం, దళాయివలస, గరుగుబిల్లి గ్రామాలలో సోమవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరుతో అక్టోబర్ 19 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీఓఓ గోపాలరావు, మహిళా సంఘ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



గొట్టివలసలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ గజలక్ష్మి, తదితరులు

ఊరటనిచ్చిన వర్షం



పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్:

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉన్నట్టుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మబ్బులు కమ్ముకోవడంతో పాటు భారీగా ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం దాదాపు గంట సమయం దంచి కొట్టింది. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు లోతట్టు ప్రాంత రైతులు ఆందోళన చెందుతుండగా.. మెట్ట ప్రాంత, శివారు ప్రాంత రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

భామిని: మండలంలో సోమవారం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, వరి పంటలకు ఈ వర్షం ఎంతో అనుకూలమని రైతులు చెబుతున్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి మండలంలోని పి. ఆమిటి జంక్షన్ వద్ద గల విశ్రాంతి భవనానికి ఆనుకుని ఉన్న భారీ వృక్షం నేలకొరిగింది. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాదం తప్పింది.



భామిని: నేరడిలో కురుస్తున్న వర్షం



గుమ్మలక్ష్మీపురం: పి.ఆమిటి జంక్షన్ వద్ద కూలిన భారీ చెట్టు

శక్తి స్వరూపిణీ నమోస్తుతే..



పాలకొండ రూరల్: నక్కలపేటలో సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



భామిని: సరస్వతీదేవి అలంకరణలో బత్తిలి దుర్గామాత



పాలకొండ రూరల్: జ్ఞాన సరస్వతిగా పూజలు అందుకుంటున్న పోలమాంబ



కురుపాం: సర్వస్వతీదేవిగా పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవతారాల్లో భాగంగా అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పలుచోట్ల అన్నదానాలతో పాటు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టారు. - సాక్షి నెట్‌వర్క్



గరుగుబిల్లి: పెద్దూరులోని దుర్గగుడిలో సరస్వతీదేవి పూజలలో పాల్గొన్న చిన్నారులు



జియ్యమ్మవలస: గవరమ్మపేటలో సరస్వతీదేవిగా పూజలు అందుకుంటున్న శక్తి స్వరూపిణి



వీరఘట్టం: కిమ్మిలో పూజలు చేస్తున్న భవానీ భక్తులు



భామిని: బత్తిలిలో సరస్వతీదేవి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

పరామర్శ



వరహాలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతీయ ఆస్పత్రుల సమన్వయాధికారి గొర్లె నాగభూషణరావు తల్లి వరహాలమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం వండువ గ్రామానికి చేరుకుని నాగభూషణరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వరహాలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, పాలవలస దవళేశ్వరరావు, తదితరులున్నారు.

● సామూహిక అక్షరాభ్యాసం



కురుపాం మండల కేంద్రంలోని విజ్ఞానభారతి పాఠశాలలో వాగ్దేవి జన్మదినం సందర్భంగా సోమవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవికి పూజలు చేశారు. అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
– కురుపాం

డిజిటల్ బుక్‌తో రెడ్‌బుక్ రాజ్యాంగానికి చెక్..

- కూటమి పాలన అంతా అరాచకమే
- వండువలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి వండువలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన డిజిటల్ బుక్‌తో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన రెడ్‌బుక్‌కు చెక్ పెడతామని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండువలోని తన నివాసంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు కూటమి ప్రభుత్వంలో కష్టాలు పడుతున్న ప్రజలకు భరోసా కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారన్నారు. కూటమి ప్రభుత్వం వేధింపులతో ఇబ్బంది పడుతున్న ప్రతిఒక్కరినీ కాపాడుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను పోలీసుల ద్వారా అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు డిజిటల్ బుక్‌ను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెట్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారి, వండువ సర్పంచ్ మిడితాన కల్యాణి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా..

సీతంపేట: కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ ఉంటుందని ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న వారిపై రానున్న రోజుల్లో చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ హెచ్.మోహనరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ ఎన్.కాంతారావు, సర్పంచ్‌లు ఎస్.సుశీల, విజయలక్ష్మి, వెంకునాయుడు, ఎంపీటీసీ సభ్యులు ఎస్.చంద్రశేఖరరావు, మంగయ్య, హరిప్రసాద్, పార్టీ నాయకులు ఎస్.రాము, షోడంగ, ఎస్.సాయికుమార్, జి.ప్రకాషరావు, ఎస్.వెంకటేష్, ఎన్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: డిజిటల్ బుక్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అన్యాయాలపై పోరాటం..

పాలకొండ: కూటమి ప్రభుత్వం చేపడుతున్న అన్యాయాలపై పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాశరావు, పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరావు అన్నారు. డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న వేధింపులను బుక్‌లో నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలవలస దవళేశ్వరరావు, దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, తిర్లంగి ఉపేంద్రకుమార్, ఎద్దు లిల్లీపుష్పనాథం, కోట అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు



భామినిలో డిజిటల్ డైరీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

కార్యకర్తలను కాపాడడానికే...

భామిని: కూటమి నాయకుల చేతిలో వేధింపులకు గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడడానికే డిజిటల్ బుక్ తీసుకువచ్చారని ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, యూత్ కన్వీనర్ గెల్లంకి రమేష్, మేడిబోయిన చలపతి అన్నారు. డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దదిమిలి, బాలేరు సర్పంచ్‌లు తొగరాన శ్రీను, జామి ప్రభాకర్, పార్టీ నాయకులు అగతముడి రఘు, రొక్కం రమేష్, పిరపక శ్రీను, పోతల మజ్జి, కొళ్ల రామారావు, గేదెల మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి గురువారం వినతుల స్వీకరణ

గరుగుబిల్లి: గ్రామ సచివాలయాల్లో ప్రతి గురువారం ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ జి. పైడితల్లి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇకపై మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లకుండా.. గ్రామ సచివాలయాల్లో అర్జీలు సమర్పించవచ్చని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.